www.jananinadam.com RNI NO:TGTEL/25/A0870 Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ. అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



బుధవారం 29-07- 2026

సంపుటి : 2 సంచిక : 93

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS | పేజీలు : 04 | వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com


## పీఎంఏవై జీ కింద రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి




**న్యూఢిల్లీ28:** తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (ఖఓంజ-ఉ) కింద 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలువురు ఎంపీలతో కలిసి కృషి భవన్ లో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం ఖఓంజ-ఉ ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్ల పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని తెలిపారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ (ంలిజీజీబ+) యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.ఎల్నినో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని కోరారు. రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న

## నీట్ అరెస్టులపై సుప్రీంకీలక ఆదేశాలు

**మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం**



**న్యూఢిల్లీ, జూలై28:** పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది

## సైబర్ మోసాల కట్టడికి డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్

**కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూ ఢిల్లీ28:** ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అధునాతన సాంకేతికతను ఉపయోగించి, బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అప్రమత్తం చేసేందుకు ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

**రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి**

**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**

**ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి**

**హైదరాబాద్,జూలై28:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు

## పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం

**కీలక బిల్లలుపై ఎన్డీఎ ఎంపిలతో మోడీ చర్చ**

**ఎన్డీఎ పక్ష ఎంపిలతో మంగళ్ మిలన్ భేటీ**



**న్యూఢిల్లీ, జూలై28:** పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్ సభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామి నేషన్స్ (సవరణ) బిల్లు-2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్లలు, మాల్రాక్టీస్లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు.


2వ పేజీలో...


## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ 28:** రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై, హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నర్సంపేట్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని, వారికి అత్యుత్తమ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.తరువాత వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, ఆయన ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు.



## ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష

**హైదరాబాద్ 28:** ఢిల్లీ ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష సమావేశం ముగిసింది.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మరియు ఎస్ఎస్ఏ జాతీయ ఇన్చార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో పాటు ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ సంఘటన్ సృజన్ అభియాన్


2వ పేజీలో...


## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ 28:** ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా తెలంగాణ


## రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

- **వందఎపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం**
- **వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**




**హైదరాబాద్,జూలై28:** రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు శాస్త్రవేత్త అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## పట్నం సోదరులకు పరామర్శించిన హరీష్‌రావు



**హైదరాబాద్28:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో ఈరోజు షాబాద్లోని వారి నివాసానికి మాజీ మంత్రి హరీష్ రావు బీఆర్ఎస్ నాయకులతో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృవియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న పట్నం నరేందర్ రెడ్డి, వారి సోదరుడు మహేందర్ రెడ్డి ని ఓదార్చారు. రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## పీఎంఏవై జీ కింద రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

**మొదటిపేజీ తరువాయి...**

భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలో చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. స్థానిక అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలన్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు ఎం అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి , పోరిక బలరాం నాయక్, , సురేష్ షెట్కార్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి, , రామసహాయం రఘురాం రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ , ఎక్స్-అఫిషియో స్పెషల్ సెక్రటరీ రామకృష్ణారావు , సెక్రటరీ



కో-ఆర్డినేషన్ అద్వైత్ కుమార్ వున్నారు.

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

**మొదటిపేజీ తరువాయి...**

ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

## ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్‌సంస్థాగత వ్యవహారాలపై కీలక సమీక్ష

**మొదటిపేజీ తరువాయి...**

కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. తెలంగాణలో నిర్వహించిన సంస్థాగత కార్యక్రమాలపై కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, సంఘటన్ సృజన్ అభియాన్ అమలును అభినందించారు. అదే సమయంలో, ఎస్ఎస్ఏ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అమలు చేయాలని పార్టీ నాయకత్వానికి సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి...**

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట28:** ఎల్ నీనో ప్రభావం వలన ఆగస్టు చివరి వారం నుండి సెప్టెంబర్ అక్టోబర్ మాసాల్లో వర్షాలు కురవవని, భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, వరి సాగు చేయకుండా ఆరుతడి పంటల సాగు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ నుండి రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ లో పంట మార్పిడి ఎల్ నీ నో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, వర్షాపాతం, భూ గర్భ జలాల స్థితి మరియు ఆయిల్ ఫామ్ సాగు గురించి రాష్ట్రంలోని అన్ని రైతువేదిలలోని రైతులు మరియు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ రైతు నేస్తం 100 ఎపిసోడ్ కార్యక్రమంలో జిల్లాలోని నంగునూరు మండలం నర్మేట రైతువేదిక నుండి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ రైతు నేస్తం కార్యక్రమం అనంతరం రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఎల్ నీ నో ప్రభావం తో వర్షాకాలంలో జూన్, జూలై లో అనుకున్నంత వర్షాలు పడలేదు. ఇప్పుడు చిన్న చితక వర్షాలు పడుతున్నాయి కానీ ఆగస్టు ఆఖరు వారం నుండి సెప్టెంబర్ లో లోటు వర్షపాతం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు సూచించారు. జిల్లాలో రైతులు సంప్రదాయంగా వరి ఒక్కటే పండిస్తున్నారని తగ్గించి నీరు తక్కువ తీసుకోవే పంటలు వేసుకోవాలి. ఒక ఎకరం వరి పండించే నీటితో 5 ఎకరాల ఆరుతడి పంటలు పండించవచ్చు. మాకు నీరు లభ్యత ఉందని వరి పండించే రైతులు ఈ నెలలోనే







రోజురోజుకి భూ గర్భ జలాలు పడిపోతున్నాయని, వరి ఏపుగా పెరిగే ఆగస్టు చివర, సెప్టెంబర్ మాసాలలో ఎక్కువ మొత్తంలో భూ గర్భ జలాలు తగ్గుతాయని, వరి ఎండిపోయే ప్రమాదం ఉందని దయచేసి వరి జోలికి పోకుండా ఆరుతడి పంటల సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏఓ మల్లయ్య, నంగునూరు ఏఎంసి చైర్మన్ యాదగిరి, స్థానిక సర్పంచ్ స్వాతి, పిఏసిఎస్ చైర్మన్ కోలా రమేష్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్ లు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవయవాలు దెబ్బతిన్న రోగులకు అపరసంజీవని సీఆర్ఆర్టీ మెడికవర్ వైద్యుల వెల్లడి

**కరీంనగర్ 28:** అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్మెంట్ ట్రీట్మెంట్ (సీఆర్ఆర్టీ) అపర సంజీవనిలా పనిచేస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో సీఆర్ఆర్టీ యంత్రం పనితీరు, దాని ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్నప్పుడు సీఆర్ఆర్టీ ఎంతో కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు. బీపీని మెయింటెన్ చేసే మందులతో 24 గంటలు డయాలసిస్ చేస్తూ ప్రాణాపాయం నుంచి కాపాడే మిషనే సీఆర్ఆర్టీ అని తెలిపారు. సాధారణ డయాలసిస్ను తట్టుకోలేని రోగులకు ఈ అత్యాధునిక చికిత్స విధానం నిరంతరాయంగా రక్తాన్ని శుద్ధి చేస్తూ శరీరంలోని వ్యర్థాలు, అదనపు ద్రవాలను తొలగిస్తుందని తెలిపారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై ఒత్తిడి తగ్గి కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సీఆర్ఆర్టీ యంత్రం పనితీరు, చికిత్స విధానం, రోగులకు కలిగే ప్రయోజనాలను వైద్యులు వివరించారు.



మెడికవర్ ఆసుపత్రిలో సీఆర్ఆర్టీ యంత్రాన్ని సమర్థవంతంగా వినియోగించి పలువురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను టీం వర్క్తో కాపాడగలిగామని వైద్యులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సరైన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, ఈ సాంకేతికత ప్రాణరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మనోజ్, వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో నేరాలపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం

**పోక్సో నిందుతులకు వరుస కఠిన శిక్షలు**

**పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్షతో సంచలన తీర్పు .... జిల్లా ఎస్పీ మహేష్ బి . గితే**



**రాజన్న సిరిసిల్ల 28:** సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలిక పై లైంగిక వేధింపుల (పోక్సో) కేసులో నిందితుడుకి 20 సంవత్సరాలు జైలు శిక్ష, 2000/- రూ. జరిమానా విధిస్తు సిరిసిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు× కేసు వివరాలు...సిరిసిల్ల కి చెందిన బుర్రా చంద్ర శేఖర్ అనే వ్యక్తి సిరిసిల్ల కి చెందిన ఒక మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేయగా, బాలిక యొక్క తల్లి పిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు.× కోర్టు తీర్పు...కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలీనీచిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన బుర్రా చంద్ర శేఖర్ కి 20 సంవత్సరాలు జైలు శిక్ష,రూ. 2000 జరిమాన విధించారు. పోక్సో కేసుల్లో జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి, ప్రాసిక్యూషన్ సమన్వయంతో వేగవంతమైన విచారణ జరిపిస్తూ నిందితులకు వరుసగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈకేసులో పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన అప్పటి విచారణ అధికారి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి , ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి,ప్రస్తుత సి.ఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్,కోర్టు మానిటరినీగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు,శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు.

## కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయల సాగు

**పరిశీలించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**30 గుంటల్లో ఆరు రకాల కూరగాయలు సాగు చేస్తున్న రైతు చెరుకు తిరుపతి**

**ఎల్ నినో ప్రభావానికి అధిగమించేందుకు మారుపాక రైతు వినూత్న విధానంలో ముందుకు**

**రాజన్న సిరిసిల్ల 28:** కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయలు సాగు చేస్తున్నారు వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉండడం, భూ గర్భ జలాలు రానురాను తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు భిన్నంగా నమోదు అవుతున్నాయి. సంప్రదాయ వరి ఇతర పంటలకు సాగు నీరు ఎక్కువ అవసరం అవుతుంది. ఎల్ నినో ప్రభావం తక్కువ వర్షపాతంతో ఇబ్బందులు అధిగమించేందుకు తనకు ఉన్న ఐదు ఎకరాలను బీడుగా వదిలివేయవద్దని, తక్కువ నీటితో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలనే ఉద్దేశంతో వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి అనే రైతు తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేస్తానని నిర్ణయించుకున్నారు. దాదాపు 30 గంటల విస్తీర్ణంలో ప్రస్తుతం బీరకాయ, కాకర కాయ, బెండకాయ, గోరు చిక్కుడు, సోర కాయ, మెంతి కూర సాగు చేస్తున్నారు. ఇప్పుడు బీరకాయ పంట చేతికి వచ్చింది. మిగతా భూమిలో వివిధ పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.× వరికి బదులుగా కూరగాయలువేములవాడ అర్బన్ మండలం మారుపాకలో రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ రైతు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్న విషయం తెలిసి నేరుగా ఆతడి వ్యవసాయ భూమికి వెళ్లారు. ఏ ఏ పంటలు వేస్తున్నారు? ఎంత విస్తీర్ణంలో వేశారు? సాగులో మెలకువలు .. సాగు విధానం తదితర అంశాలపై తిరుపతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కు అనుగుణంగా చెరుకు తిరుపతి కూరగాయలు సాగు చేయడాన్ని చూసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో



వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతు సంప్రదాయ పంటలు సాగు చేయకుండా కూరగాయలు సాగు చేస్తున్నారని వివరించారు. వరికి బదులుగా కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందే మార్గాన్ని రైతు అవలంబిస్తున్నారని తెలిపారు. వివిధ రకాల కూరగాయలు సాగు చేయడంతో తనకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని, వాతావరణ ఇబ్బందులు, నీటి సమస్య దూరం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే సేంద్రియ ఎరువులు ఉపయోగించి పంటలు సాగు చేస్తే రైతులకు మరింత ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మిగతా రైతులు కూడా తమకు ఉన్న భూమిలో ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని, ప్రస్తుత వాతావరణ ఇబ్బందుల నుంచి బయట పడాలని పిలుపు నిచ్చారు. ఉద్యానవన శాఖ ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ ఏడాది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు సాగాలని పిలుపు నిచ్చారు. పరిశీలనలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ వేములవాడ డివిజన్ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు ఉన్నారు

## హెపటైటిస్ నివారణకు అప్రమత్తతే రక్షణ

**- ప్రపంచ హైపటైటిస్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెపటైటిస్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మాతా--శిశు సంరక్షణ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో హెపటైటిస్



వ్యాధులపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే వైరల్ వ్యాధి అని, హెపటైటిస్-ఏ, బీ, సీ, డీ, ఈ వైరస్‌ల ద్వారా సంక్రమిస్తుందని వివరించారు. కలుషిత రక్తం, వినియోగించిన సూదులు, తల్లి నుంచి శిశువుకు, కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని వెల్లడించారు. హెపటైటిస్‌ను మౌన వ్యాధిగా పేర్కొంటూ, ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోయినా కాలేయానికి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. వ్యాధి తీవ్రత పెరిగితే జీర్ణక్రియ దెబ్బతిని కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశముందని తెలియజేశారు. మత్తు పదార్థాల వినియోగం, మద్యపానం, అనారోగ్యకర జీవనశైలి, వ్యక్తిగత పరిశుభ్రత లోపం కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా డిస్పోజబుల్ సిరంజీలనే వినియోగించాలని, శస్త్రచికిత్సలు, రక్త మార్పిడికి ముందు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందడం, హెపటైటిస్-బి టీకా తీసుకోవడం ద్వారా వ్యాధిని సమర్థంగా నివారించవచ్చని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు వెల్లడించారు. ప్రజలు హెపటైటిస్‌పై అవగాహన పెంచుకొని అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు తమ పరిధిలో హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకుడు డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైరల్ హెపటైటిస్ జిల్లా కోఆర్డినేటర్ మధు, సీహెచ్‌వోలు పుట్ట సత్తయ్య, కాకిరాల వెంకటేశ్వర్లు, నామ్‌దేవ్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ అమన్, డాక్టర్ రమ్య, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వరికి బదులుగా ఆరుతడి పంటలే మేలు

## ఎల్‌నినోతో లోటు వర్షపాతం.. రైతులకు కలెక్టర్ హరిత సూచన



**జననినాదం,సిర్పూర్(టి)/ ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 28:** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత రైతులకు సూచించారు. మంగళవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు, ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని కలెక్టర్ తెలిపారు. దీంతో ఆయకట్టు కింద వరి సాగు చేసే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వరికి బదులుగా కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి ఆరుతడి పంటలను సాగు చేసి మెరుగైన ఆదాయం పొందాలని సూచించారు. ఈ పంటలకు అవసరమైన విత్తనాలు వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు గ్రామపంచాయతీలు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఏడీ మనోహర్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో కోట ప్రసాద్, సర్పంచ్ ఓడేటి లావణ్య, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

## పారిగాం పాఠశాల, లోనవెల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ కె.హరిత



**జననినాదం,సిర్పూర్(టి)/ ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 28:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకుని పాఠశాలలను బలోపేతం చేయాలని కలెక్టర్ కె.హరిత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాలు, ఇంకుడు గుంత, మూత్రశాలలను పరిశీలించారు. 6, 7వ తరగతి విద్యార్థుల గణితం, సైన్స్ సబ్జెక్టులలో అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు నాణ్యమైన విద్య బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. తర్వాత లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, సిబ్బంది హాజరు, రిజిస్టర్లు, ఓపీ, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

# నాణ్యమైన విద్యే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలి

**తరగతి గదిలో సృజనాత్మక బోధనకు ప్రాధాన్యం...ఎఫ్ఎల్ఎన్‌తోనే విద్యార్థులకు బలమైన పునాది**

**ఐ టీ డి ఏ పి ఓ మంద మకరందు**

**ఉట్నూరులో 'విద్యా జ్యోతి' ఐదు రోజుల శిక్షణ ప్రారంభం**



**జననినాదం,ఉట్నూరు 28:** గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రతి ఉపాధ్యాయుడి ఏకైక ధ్యేయంగా ఉండాలని ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మంద మకరందు పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ నిర్వహిస్తున్న 'విద్యా జ్యోతి--సామర్థ్యాభివృద్ధి, సమగ్ర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం' ఐదు రోజుల శిక్షణను మంగళవారం ఉట్నూరులోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠ్యాంశాన్ని బోధించడంతో పాటు పాఠ్య ప్రణాళికను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వారాంత ప్రణాళిక ప్రకారం బోధన సాగించాలని సూచించారు. కార్యకలాపాల ఆధారిత బోధన, వినూత్న బోధనా పద్ధతులు, వాస్తవ జీవిత ఉదాహరణలను ఉపయోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలని సూచించారు. విద్యార్థుల్లో లక్ష్య నిర్దేశం, ఆత్మవిశ్వాసం, జీవిత నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) విద్యకు బలమైన పునాది అని, ఈ దశలోనే అభ్యాస నైపుణ్యాలు మెరుగైతే ఉన్నత తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలను సానుకూలంగా పరిశీలించి గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జి. చందన్, ఏపీఓ (పీవీటీజీ) ఎ. భాస్కర్, డీటీడీఓ నిర్మల్ నిహారిక, ఏసీఎంఓ ఎ. జగన్, ఎస్వో పార్థసారథి, జీసీడీఓ ఛాయ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్‌రావు, రిసోర్స్ పర్సన్లు, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన తెలుగు, ఆంగ్లం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యార్థుల ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఏకరూప దుస్తులను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కుట్టు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి ఏకరూప దుస్తుల తయారీ పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి విద్యార్థి కొలతలను సరిగ్గా తీసుకుని, వారి కొలతలకు అనుగుణంగా దుస్తులు కుట్టాలని, పనులలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, ఉపాధి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాయని, మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సుభాష్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల హెచ్చరిక.. అప్రమత్తంగా ఉండాలి

**28--31 వరకు ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు**

**ప్రజలకు కలెక్టర్ కె. హరిత**



**జననినాదం, ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 28:** జిల్లాలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. భారత వాతావరణ శాఖ ప్రాంతీయ వాతావరణ కేంద్రం, నాగ్‌పూర్ జారీ చేసిన హెచ్చరికల మేరకు ఉరుములు, మెరుపులు, గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపారు.అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, నదుల సమీపాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడరాదన్నారు.భారీ వర్షాల వల్ల రహదారులపై నీరు నిలవడం, రవాణాకు అంతరాయం కలగడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, బలహీన నిర్మాణాలకు నష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పంటలు, వ్యవసాయ పరికరాలను సురక్షితంగా ఉంచాలని సూచించారు. వాతావరణ శాఖ, స్థానిక అధికార యంత్రాంగం జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ కోరారు. ప్రజారక్షణ కోసం అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్, బూత్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ లో ఎటువంటి లోపాలు, వ్యత్యాసాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులను రికార్డులను అనుసరించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం మందమర్రి మండలంలోని అందుగులపేటలో గల వాసవి పీబీఆర్ఎం రైస్ మిల్లు, లక్ష్మీ గణపతి పీబీఆర్ఎం రైస్ మిల్లులను సందర్శించి పెండింగ్ సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) అంశంపై సమీక్షించారు. మిల్లర్లతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి సకాలంలో అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట తహసిల్దార్ దిలీప్ కుమార్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి

**ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలి**

**బోగస్ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి**

**బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్**



**జననినాదం,తిర్యాణి 28:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తిర్యాణి మండలంలో వంద శాతం పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, తిర్యాణి మండల ఎస్ఐఆర్ సంయోజకుడు చేపూరి నవీన్ గౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు నిర్వహించిన ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బీఎల్ఏ-2లు సమన్వయంతో పనిచేసి అర్హుల పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించాలని, బోగస్ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సారా రమేష్ గౌడ్, మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, తిరుపతి, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, వివిధ మోర్చాల నాయకులు, బీఎల్ఏ-2లు, యువమోర్చా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధం

**పాట్నాపూర్ సిద్ధమహాయోగా పీఠంలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమాలు**

**భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం ... సంస్థాన్ అధ్యక్షుడు కేశవరావు ఇంగిలే**



**జననినాదం,జైనూర్ 28:** జైనూర్ మండలం పాట్నాపూర్‌లోని శ్రీ సిద్ధమహాయోగా పీఠం--శ్రీ పరమహంస సద్గురు పూలజీ బాబా సంస్థాన్‌లో గురుపౌర్ణమి మహోత్సవాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. మంగళవారం బాబా సతీమణి ఇంగిల్ దుర్పత బాయి చేతుల మీదుగా జెండా పూజ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి ధ్యాన ధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థాన్ అధ్యక్షుడు కేశవరావు ఇంగిలే మాట్లాడుతూ పరమహంస సద్గురు పూలజీ బాబా బోధించిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ గురుపౌర్ణమి వేడుకలను ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తుల కోసం తాగునీరు, అన్నప్రసాదం, విశ్రాంతి, పారిశుద్ధ్యం తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగేలా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఇంగిలే వామన్, ట్రాన్స్‌కో రిటైర్డ్ అధికారి బీబీ సింగ్, కమిటీ సభ్యులు దాదారావు, సుభాష్ దుర్రే, స్థానిక సర్పంచ్ కందరే బాలాజీ లక్ష్మి, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పటేల్ గంగాధర్, రంగారావు దంబి, తదితర భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**



**జననినాదం,ఆసిఫాబాద్ 28:** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికల)లో మంగళవారం ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల విషయాల వారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించడం ద్వారా విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచవచ్చని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో అందించే అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని తరగతి గదిలో సమర్థంగా అమలు చేయాలని సూచించారు. మొదటి విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, బయోసైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి కేంద్రిత బోధన, సమర్థవంతమైన పాఠ్య ప్రణాళిక, అభ్యాస ఫలితాల సాధన, వినూత్న బోధనా విధానాలు, తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్ణా ఉద్ధవ్, జీసీడీఓ కొట్నాక శకుంతల, జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, ప్రధానోపాధ్యాయులు, శిక్షణ సమన్వయకర్తలు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీతో గ్రామాల్లో శాశ్వత ఆస్తులు సృష్టించాలి

**ఎంపీడీవో నాగేష్ ...మందగూడలో జీపీడీపీ గ్రామసభ**



**జననినాదం,తిర్యాణి 28:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో నాగేష్ అన్నారు. మందగూడ గ్రామపంచాయతీలో జీపీడీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలోని అర్హులైన ప్రతి కూలీకి 100 రోజుల ఉపాధి కల్పించడంతో పాటు పంటకుంటలు, ఇంకుడు గుంతలు, చెరువులు, బావుల అభివృద్ధి వంటి పనులను చేపట్టాలన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంటకుంట, ఊరికి ఊటకుంట అనే లక్ష్యంతో గ్రామస్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా వాటర్ పార్క్ ఏర్పాటుపై కూడా గ్రామసభలో చర్చించి, గ్రామాభివృద్ధి పనుల అమలులో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంరం గోపాల్, ఎంపీఓ, పంచాయతీ అసిస్టెంట్ విశ్వనాథ్, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆధునిక పరికరాలతో రైతులు వ్యవసాయ వ్యయాన్ని తగ్గించుకోవాలి

**వ్యవసాయ అధికారి సంజయ్**

**లింగాపూర్‌లో 40 మంది రైతులకు చార్జింగ్ స్ప్రేయర్ల పంపిణీ**



**జననినాదం,లింగాపూర్ 28:** రైతులు ఆధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవడం ద్వారా శ్రమ, సమయంతో పాటు వ్యవసాయ వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని లింగాపూర్ వ్యవసాయ అధికారి సంజయ్ అన్నారు. లింగాపూర్ మండలంలోని గున్నూరు వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, అట్లాస్ కాప్కో సంస్థ ఆర్థిక సహకారంతో ఆరు గ్రామాలకు చెందిన 40 మంది రైతులకు చార్జింగ్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం పెరుగుతోందని, చార్జింగ్ స్ప్రేయర్ల వినియోగంతో పంటలకు మందుల పిచికారీ వేగంగా, సమర్థవంతంగా చేయవచ్చన్నారు. రైతులు అందించిన పరికరాలను సక్రమంగా వినియోగించి మెరుగైన దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్, అట్లాస్ కాప్కో సంస్థలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు సమావేశం ఏర్పాటు చేసి వారికి పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ రాంరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఆత్రం చంద్రా బాగా ,పటేల్ తెలంగరావు, ప్రాజెక్టు మేనేజర్ రాటోడ్ ధనరాజ్, నారాయణ కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**- విద్యార్థి నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై సంచరిస్తున్న పశువుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మేయర్ ధరణి మధుకి వినతిపత్రం సమర్పించినట్లు విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ముఖ్యంగా రాత్రి వేళల్లో యజమానులు నిర్లక్ష్యంగా పశువులను రోడ్లపై వదిలివేయడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారులపై అకస్మాత్తుగా పశువులు ఎదురుపడటంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, దీంతో అనేక మంది తీవ్రంగా గాయపడటమే కాకుండా కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నగరంలో సంచరిస్తున్న పశువులను గుర్తించి ప్రత్యేక గోశాలలు లేదా నిర్దేశిత ప్రదేశాలకు తరలించే చర్యలు చేపట్టాలని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని మేయర్‌ను కోరినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నగరపాలక సంస్థ వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రాంటెంకి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

**- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలు, మురికి కాలువలు, వ్యాపార దుకాణాలు, మార్కెట్లలోనూ వీటి విచ్చలవిడి వాడకం కనిపిస్తోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మురికి కాలువలు పూడుకుపోవడం, వర్షపు నీరు నిలిచిపోవడం, పశువులు ప్లాస్టిక్ తినడం, భూమి, నీరు కలుషితం కావడం వంటి సమస్యలు ప్లాస్టిక్ కవర్ల వల్ల తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మున్సిపల్ అధికారులు తక్షణమే పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని, మార్కెట్లు, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచనలు అందాయి. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే, వాడే వ్యాపారులపై జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, క్లాత్ బ్యాగులు, జూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మంచిర్యాలను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడానికి అధికారులు చురుగ్గా స్పందించాలని ఆకాంక్షిస్తున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి

**చోర్‌పల్లి సర్పంచ్ మర్సుకోలా అనసూయ**

**చోర్‌పల్లిలో 20 మందికి పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ**



**జననినాదం,సిర్పూర్(యు),లింగాపూర్ జూలై 28:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని చోర్‌పల్లి గ్రామ సర్పంచ్ మర్సుకోలా అనసూయ,జుగాదిరావ్‌లు అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని 20 మంది అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం నిలకంఠ్‌రావు, గ్రామ కార్యదర్శి వీరబాబు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థిక లబ్ధి పొందాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు కష్టతరమైన నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని, రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. వరి సాగు మినహా పంట రకాన్ని ఎంచుకోవాలని, తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందని, రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలు పొందాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాలను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో వంట సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.తాండూర్ మండలం ద్వారకాపురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తు భూ లావాదేవీలకు సంబంధించి మ్యాపు లో మార్పులు తప్పనిసరిగా నవీకరించడం జరుగుతుందని, గ్రామంలో దాదాపు 90 శాతం భూములకు శాశ్వత పరిష్కారం జరిగిందని, మిగిలిన భూమి న్యాయస్థానంలో కొనసాగుతున్న వివాదాల తీర్పు అనంతరం పరిష్కారం అవుతుందని తెలిపారు. రీ సర్వే అనంతరం అసలైన అర్హుల పేరిట భూ రికార్డులు ఉంటాయని, నక్షా పకడ్బందీగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం తాండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి అంజయ్య, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సుష్మ లతో కలిసి రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులు ప్రభుత్వ సూచనల ప్రకారం పంట సాగు చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 28:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య, ఎస్ఐ విక్రమ్ పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీసీపీ, రిసెప్షన్ సెంటర్‌లోని సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,అప్‌లోడ్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ దేవయ్య, ఎస్ఐ విక్రమ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కృషి చేయాలని తెలిపారు. అలాగే రహదారి భద్రత,ట్రాఫిక్ నిబంధనలు,హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వాటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ దేవయ్య, ఎస్ఐ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కడారి అయిలన్న కురుమ నియామకం

**కరీంనగర్ జూలై 28**: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కడారి అయిలన్న కురుమను నియమించారు. మంగళవారం కరీంనగర్లోని తారక హోటల్లో నిర్వహించిన జిల్లా నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా చైర్మన్ జి.ఎస్. ఆనంద్ ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా జి.ఎస్. ఆనంద్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం అవసరమైతే మరో ఉద్యమానికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు. కే.కే. కమిటీ త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని ఉద్యమకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నియామకంపై కడారి అయిలన్న కురుమ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఫోరం నాయకులు, మహిళా ప్రతినిధులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460